

చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు ప్రకారం పలికాయి.



ఐదు రోజులు వర్షాలు

రాగల ఐదు రోజులు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
35.7°/22.1°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బుద్ధి తెచ్చుకో బాబూ..

- కొమ్మినేని అరెస్టు అన్యాయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతపురం కార్పొరేషన్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టుపై సుప్రీంకోర్టు ఉత్తర్వులతోనైనా సీఎం చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని, ప్రజా ప్రయోజనాలపై దృష్టిసారించాలని, లేని పక్షంలో చరిత్రహీనుడుగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాక్షి టీవీ డిబేట్‌లో విశ్లేషకులు వ్యాఖ్యలు చేస్తే కొమ్మినేని శ్రీనివాసరావుపై కేసు ఏవిధంగా నమోదు చేస్తారని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు నియంత పాలనకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని పేర్కొన్నారు. ఇటీవల సాక్షి టీవీలో జరిగిన ఓ డిబేట్ కార్యక్రమంలో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో అలజడి వాతావరణం సృష్టించారన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టులో కూటమి ప్రభుత్వం కనీస నిబంధనలను పాటించలేదన్న విషయం సుప్రీంకోర్టు తీర్పు ద్వారా స్పష్టమైందని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఈ తీర్పు కచ్చితంగా చెంపపెట్టని అభివర్ణించారు. ఇదే సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిపై కూడా దుష్ప్రచారం చేశారని, కుట్రపూరితకంగా సాక్షి కార్యాలయాలపై దాడి చేశారని, తక్షణం వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని కోరారు.

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన బీ ఫార్మసీ ఒకటో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–23) రెగ్యులర్, సప్లిమెంటరీ , (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్‌నాయుడు శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

మద్యం షాపుల దరఖాస్తుకు 19న చివరి గడువు

అనంతపురం: మద్యం షాపుల నిర్వహణకు సంబంధించి ఈ నెల 19 తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రి మున్సిపాలిటీలో మూడు, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఒకటి, పెద్దవడుగూరులో ఒకటి చొప్పున మద్యం షాపుల నిర్వహణకు సంబంధించి ఆఫ్‌లైన్ లేదా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. నాన్ రీఫండబుల్ కింద రూ.2లక్షలు డిపాజిట్ చేయాలి. ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో లాటరీ ప్రక్రియ ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు.

'పచ్చ' నేతల ఇసుక మేత

- అడ్డుకున్న నిదనవాడ రైతులు



జేసీబీని అడ్డుకుంటున్న రైతులు

శింగనమల: పచ్చ నేతలు బరితెగించారు. పెన్నా నదిలో ఇసుకను అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతుండడంతో రైతులు తిరగబడ్డారు. ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. పెద్దవడుగూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు చిత్రచేడు వైపున పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇక అక్కడి నుంచి శింగనమల మండలం నిదనవాడ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంపై కన్నుపడింది. రెండు రోజుల నుంచి యథేచ్ఛగా జేసీబీని పెట్టి ఇసుకను తవ్వి టిప్పర్లద్వారా తరలించారు. విషయం తెలుసుకున్న నిదనవాడ రైతులు పార్టీలకతీతంగా ముందుకు వచ్చి ఇసుకాసురులకు చెక్‌పెట్టారు. అక్రమంగా పెద్దపెద్ద గుంతలు తవ్వి ఇసుక తరలిస్తే భూగర్భజలం తగ్గిపోతుందని వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న శింగనమల సీఐ కౌలుట్లయ్య సిబ్బందితో వచ్చి ఇసుక కోసం తీసిన గుంతలను పరిశీలించారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మామూళ్ల విత్తు.. రైతు చిత్తు!



కూటమి సర్కారు పుణ్యమా అని అన్నదాతలు దగాకు గురవుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీలోనూ అన్యాయం చేస్తున్నారు. సర్కారుకు చిత్తశుద్ధి లేకపోవడం, అధికారుల కక్కుర్తి, ఏజెన్సీల ధనదాహం వెరసీ రైతులకు నాసిరకం విత్తనకాయలు అంటగట్టి నిలువునా ముంచుతున్నారు. ఏమాత్రమూ ప్రాసెసింగ్ చేయకుండానే విత్తనకాయలను ఏజెన్సీల నుంచి పంపిణీ కేంద్రాలకు సరఫరా చేసినట్లు స్పష్టమవుతోంది.

శెనిక్కాయ మాటున డబ్బుల గుటుక్కు

- అనుమతులు రాకముందే ఏజెన్సీల నుంచి విత్తన కాయల సరఫరా
- 31న ఏజెన్సీలు దరఖాస్తు చేస్తే 26నే అనుమతులు!
- ప్రాసెసింగ్ చేయకుండానే విత్తన కాయల సరఫరా
- మొత్తం వ్యవహారంలో ఓ అధికారిపై తీవ్ర విమర్శలు
- కాసుల కక్కుర్తితో రైతులను నిండా ముంచుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: విత్తన కాయలను రైతుల దగ్గర కొని, శుద్ధి చేసి నాణ్యమైన వాటిని అందించే బాధ్యత ఏపీసీడ్స్ కార్పొరేషన్‌ది. అయితే, కొన్ని రోజులుగా విత్తన వేరుశనగను సేకరించి.. వాటిని శుద్ధి చేసే బాధ్యతలను కొన్ని ఏజెన్సీలకు అప్పజెబుతున్నారు. ఇక్కడే మతలబు మొదలైంది. సాధారణంగా ఏజెన్సీలకు ఏపీ సీడ్స్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చిన తర్వాతే విత్తన కాయల శుద్ధి, సరఫరా జరగాలి. కానీ కొన్ని ఏజెన్సీలకు అనుమతులు ఇవ్వకముందే విత్తనకాయల సరఫరా మొదలుపెట్టాయి. వాస్తవానికి శుద్ధి చేసిన తర్వాత నాణ్యమైన విత్తనకాయలను మాత్రమే రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కేల)కు తరలించాలి. అక్కడ రైతులకు పంపిణీ చేస్తారు. అయితే.. ఏమాత్రమూ ప్రాసెసింగ్ (శుద్ధి) చేయకుండానే నాసిరకం కాయలను సంచుల్లో నింపి పంపిస్తున్నారు.

ఏజెన్సీలు, అధికారుల కుమ్మక్కు

రైతులకు నాణ్యమైన విత్తనకాయలు అందేలా చూడాల్సిన ఏపీ సీడ్స్ కార్పొరేషన్ అధికారులు ఏజెన్సీలతో కుమ్మక్కై తమ బాధ్యతలను గాలికొదిలేశారు. విత్తన కాయలు శుద్ధి అవుతున్నాయా, నాణ్యతగా ఉన్నాయా, లేదా అనేది ఎక్కడా పరిశీలించలేదు. ఏజెన్సీలు విత్తనకాయలను శుద్ధి చేసేందుకు అవసరమైన యంత్ర పరికరాలు ఉన్నాయో, లేదో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించిన అనంతరం వాటికి అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ వారు కూడా సరఫరా ఏజెన్సీల ఇష్టారాజ్యానికి వదిలేశారు. అసలు ఏమాత్రమూ శుద్ధి చేయకుండానే ఇప్పటివరకు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున విత్తన కాయలను ఆర్‌ఎస్‌కేలకు చేర్చారు. అక్కడక్కడ అనుమానం వచ్చిన చోట్ల ఆర్‌ఎస్‌కే సిబ్బంది విత్తనకాయలను పరిశీలించి..నాణ్యత లేనివాటిని వెనక్కి పంపిస్తున్నారు.

దరఖాస్తు చేయకముందే అనుమతి ఇచ్చారట!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీలో భాగంగా విత్తన శుద్ధి, ప్యాకింగ్, సరఫరాకు సంబంధించి మొత్తం 18 ఏజెన్సీలకు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటికే రైతులకు విత్తన పంపిణీ మొదలుపెట్టారు. అయితే..అనుమతులు రాకముందు నుంచే కొన్ని ఏజెన్సీలు విత్తనకాయల సరఫరా మొదలుపెట్టడం గమనార్హం. అధికారులు భరోసా ఇవ్వడం వల్లే ఇలా చేశాయన్నది స్పష్టమవుతోంది. ఈ ఏజెన్సీల్లో కదిరిలోని శ్రీ కార్తికేయ ఆగ్రో సీడ్స్ తో పాటు మరికొన్ని ఉన్నాయి. వాస్తవానికి ఇవి గత నెల 31న అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అయితే..అంతకుముందే అంటే మే 26, 27వ తేదీనే అనుమతి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు చేయకముందే అనుమతి ఎలా ఇచ్చారన్నది అంతుపట్టని విషయం. పైగా ఈ ఏజెన్సీలకు ఫీల్డ్ సూపర్‌వైజర్‌ను కూడా సీడ్ కార్పొరేషన్ డీఎం నియమించడం అనుమానాలకు తావిస్తోంది.

పావగడ నుంచి విత్తనకాయలు

ఉమ్మడి అనంతపురం జిల్లా సీడ్ కార్పొరేషన్ అధికారికి కర్ణాటకలోని పావగడ వద్ద ఓ విత్తన శుద్ధి ప్లాంటు ఉన్నట్టు సమాచారం. అక్కడి నుంచి విత్తనకాయలను అనుమతులు లేకుండా ఏజెన్సీలకు సరఫరా చేసి.. అక్కడి నుంచి రైతులకు ఇస్తున్నట్టు తెలుస్తోంది. విత్తనకాయల శుద్ధి, నాణ్యతపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు గానీ, కలెక్టర్ల పరిధిలో గానీ ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో రైతులు దగాకు గురవుతున్నారు. ఏజెన్సీలు, సీడ్ కార్పొరేషన్ అధికారులు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందాన వ్యవహారం నడుస్తోంది. ప్రొద్దుటూరుకు చెందిన సుబ్రమణ్యేశ్వర ఆగ్రో సీడ్స్ సంస్థను అడ్డుపెట్టుకుని ఇక్కడ సీడ్ కార్పొరేషన్ అధికారి భారీ దందా చేస్తున్నట్టు తెలిసింది.

ఉమ్మడి అనంత జిల్లాకు కావాల్సిన వేరుశనగ విత్తన కాయలు	1.10 లక్షల క్వింటాళ్లు
ఇప్పటివరకూ సరఫరా అయినవి	40,000 క్వింటాళ్లు
ఇంకా రావాల్సినవి	70,000 క్వింటాళ్లు
ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుశనగ పంట సాగు	3.40 లక్షల హెక్టార్లు
రైతులు	2.40 లక్షలు పైనే

టెండర్‌లో క్వాలిఫై అయ్యారని ఇచ్చారట..

విత్తన కాయల పంపిణీలో అక్రమాలపై సీడ్ కార్పొరేషన్ డీఎం రామసుబ్బయ్యను 'సాక్షి' వివరణ కోరగా.. ఆయన తికమక సమాధానాలు ఇచ్చారు. క్వాలిఫై అయింది కాబట్టి సుబ్రమణ్యేశ్వర ఆగ్రో సీడ్స్ తరఫున ఏజెన్సీకి ఇచ్చామని ఒకసారి, అవి వ్యవసాయశాఖ ఇచ్చిన అనుమతులని మరోసారి చెప్పుకొచ్చారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం ఆలస్యమైందని ఆయన చెప్పడం కొసమెరుపు. దీంతో మొత్తం వ్యవహారంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

'తల్లికి వందనం'.. తప్పులతో ఎగనామం



పెద్దవడుగూరు: 'తల్లికి వందనం' వివరాల నమోదు తప్పులతడకగా ఉండటంతో అర్హత కలిగిన పలువురికి పథకం వర్తించలేదు. ఎవరో చేసిన తప్పిదాలకు తమకు లబ్ధి చేకూరకుండా ఎగనామం పెట్టారని బాధితులు వాపోతున్నారు. వ్యవసాయ భూమి తక్కువ ఉన్నా 10 ఎకరాలకు పైబడి ఉందని అనర్హుల జాబితాలో చేర్చారని పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తికి చెందిన ఆదినారాయణ, లక్ష్మంపల్లికి చెందిన రెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, పుల్లన్న తెలిపారు. సుధాకర్‌రెడ్డికి 3 ఎకరాల పొలం ఉంటే.. పది ఎకరాలు ఉన్నట్లు చూపారు. ముప్పాలగుత్తి గ్రామంలో చంద్రశేఖర్ అనే వ్యక్తికి వ్యవసాయ భూమి లేకున్నా అనర్హుల జాబితాలో పేరు వచ్చింది. ధనలక్ష్మి, సుజాతకు కూడా భూమి తక్కువ ఉన్నా ఎక్కువగా ఉన్నట్లు నమోదవడంతో లబ్ధి పొందలేకపోయారు. మరికొందరికి ఇద్దరు పిల్లలు ఉన్న చోట ఒకరికి మాత్రమే రూ.13వేలు వర్తింపజేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులను వివరణ కోరగా తక్కువ భూమి ఉన్నా.. రీ సర్వే జరిగిన గ్రామాల్లో వారి భూముల సమస్యలను అలాగే పెట్టుకోవడం వల్ల జాయింట్ ఎల్‌పీఎం కింద భూములు ఉన్న రైతులు అనర్హులుగా మారిపోయారని తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో దాదాపు 6,088 మందికి పథకం వర్తించగా.. 808 మందిని అనర్హుల జాబితాలో ఉంచారు. అర్హత ఉన్నా డబ్బు పడని వారి నుంచి అర్జీలు స్వీకరించి.. పరిష్కారం చేస్తామని ఎంపీడీఓ బాలస్‌సాహెబ్ తెలిపారు.

రీకౌంటింగ్ గడువు ఈ నెల 19

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలకు సంబంధించి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్ ద్వారా జవాబుపత్రాలు పొందేందుకు రూ.1000 ఫీజు చెల్లించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం లాగిన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత దరఖాస్తులు స్వీకరించబోమని తెలియజేశారు.

బదిలీ టీచర్లకు 'స్పౌజ్' తంటా

- తప్పనిసరిగా 'స్పౌజ్' సమీపంలోకి వెళ్లాల్సిందే
- 'స్పౌజ్' పాయింట్లు పొందినవారికంటే జనరల్ టీచర్లకు సౌకర్యవంతమైన స్కూళ్లు
- ఎక్కువ పాయింట్లు ఉన్నా దూరానికి వెళ్తున్న 'స్పౌజ్' టీచర్లు
- నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్న విద్యాశాఖ
- తలలు పట్టుకుంటున్న 'స్పౌజ్' టీచర్లు



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: దంపతులిద్దరూ ఉద్యోగులై ఉండి వేర్వేరు ప్రాంతాల్లో ఉంటే కుటుంబ పరంగా ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయకోణంలో ఆలోచించి 'స్పౌజ్' పాయింట్ల పద్ధతి తీసుకొచ్చింది. దీనిద్వారా బదిలీల్లో భార్య/భర్తలో ఒకరు ఐదు పాయింట్లు పొందవచ్చు. 'స్పౌజ్' కోటాలో బదిలీ అయ్యే భర్త లేదా భార్య పని చేస్తున్న సమీపంలోకి వెళ్లాలి. ఇద్దరూ వెళ్లొచ్చేందుకు సౌకర్యవంతంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని ఎప్పటి నుంచో అమలు చేస్తోందని అధికారులు చెబుతున్నారు. అయితే 'స్పౌజ్' కోటాలో పాయింట్లు పొందిన చాలామంది భర్త/భార్య పని చేస్తున్న సమీపానికి కాకుండా జిల్లా కేంద్రానికి లేదా వారికి అనుకూలమైన స్కూళ్లకు వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో చాలామంది జిల్లా సరిహద్దు మండలాల్లో పని చేస్తున్నా.. వారి భాగస్వాములు మాత్రం 'స్పౌజ్' పాయింట్లు పొంది జిల్లా కేంద్రం, పట్టణాల చుట్టుపక్కల ప్రాంతాల్లోనే పని చేస్తున్నారు.

'స్పౌజ్' సమీపంలోకి వెళ్లాల్సిందే!

తాజాగా జరుగుతున్న ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌లో 'స్పౌజ్' నిబంధనలను విద్యాశాఖ అధికారులు పక్కాగా అమలు చేస్తున్నారు. భార్య, భర్త పని చేస్తున్న స్కూల్‌లో ఖాళీగా ఉంటే కచ్చితంగా అక్కడికి పోవాల్సిందే. అక్కడ ఖాళీ లేకపోతే సమీప స్కూళ్లు, మండలం, ఆ తర్వాత పక్క మండలాలకు వెళ్లాల్సి ఉంది. ఒకే స్కూల్‌కు అంటే మరీ ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో టీచర్లు తక్కువ సంఖ్యలో ఉంటారని, ఈ నేపథ్యంలో అవసరాలకు దంపతులిద్దరూ ఒకేసారి సెలవు పెట్టుకోవడం ఇబ్బందిగా ఉంటుందని బాధిత టీచర్లు వాపోతున్నారు.

పాయింట్లు ఉన్నా దూర ప్రాంతాలకు..

ఎక్కువ పాయింట్లు ఉండికూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. కూడేరు మండలం గొట్కూరులో పని చేస్తున్న శ్రీదేవికి స్పౌజ్ పాయింట్లతో కలిపి 42.6 పాయింట్లు ఉన్నాయి. ఈమెభర్త శ్రీనివాసరెడ్డి ఇటీవల గణితం స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు వెళ్లారు. దీంతో శ్రీదేవి కూడా అక్కడికి పోవాల్సిందేనంటూ అధికారులు తేల్చి చెప్పడంతో ఆమె కూడా బొమ్మనహాళ్ మండలానికి వెళ్లారు. 35, 36 పాయింట్లు ఉన్న జనరల్ టీచర్లకు అనంతపురం చుట్టుపక్కన 16 శాతం హెచ్‌ఆర్‌ఏ స్కూళ్లు వచ్చాయి. తాడిపత్రి, హిందూపురం, గుంతకల్లు, కదిరి, ధర్మవరం, పెనుకొండ, కళ్యాణదుర్గం, గుత్తి ప్రాంతాల్లో ఎక్కువమంది 'స్పౌజ్' టీచర్లు పాయింట్లు ఎక్కువ ఉన్నాకూడా భర్త/భార్య పని చేస్తున్న కారణంగా దూరంగా వెళ్లారు.

- ఉరవకొండ మండలంలో భర్త పని చేస్తున్న స్కూల్‌లో ఖాళీగా ఉండడంతో 'స్పౌజ్' పాయింట్లు పొందిన భార్య పక్కన మరో స్కూల్‌ను కోరుకుంది. కొందరు అభ్యంతరం చెప్పడంతో భర్త పని చేస్తున్న స్కూల్‌కు వెళ్లాల్సి వచ్చింది.
- రాష్ట్ర కేడర్ కల్గిన ఉద్యోగులు జిల్లాలో పని చేస్తుంటే 'స్పౌజ్' కింద వారి సమీపంలోకి వెళ్లాల్సిందేనంటూ అధికారులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో నార్పలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భార్య అనంతపురం రూరల్ మండలంలో కోరుకోవాలని చూసినా...డీఈఓ ఒప్పుకోలేదు.
- శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పిన్నదరిలో భర్త సోషల్ టీచరుగా పని చేస్తున్నారు. భార్య దాడితోటలో ఎస్జీటీగా పని చేస్తోంది. పిన్నదరికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న బత్తలపల్లి మండలం మాల్యవంతం ఇవ్వాలని కోరినా.. మండలం వేరే అవుతున్న కారణంగా ఇవ్వడానికి సాధ్యంకాదని డీఈఓ తేల్చి చెప్పారు.

స్పష్టమైన ఆదేశాలు

'స్పౌజ్' పాయింట్లు పొందిన వారు ఇష్టానుసారంగా స్థానాలు కోరుకునేందుకు లేదు. ప్రత్యేకించి ఈ విషయంలో కమిషనర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. 'స్పౌజ్' పని చేస్తున్న స్కూల్‌కు సమీపంలోకి వెళ్లాల్సిందే. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు.
– ఎం.ప్రసాద్‌బాబు డీఈఓ

తప్పని జాగరణ



కౌన్సెలింగ్ వేదికపై కూర్చుని నిరసన తెలియజేస్తున్న భాషాపండితులు

అనంతపురం ఎడ్యుకేషన్: సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీల)కు జరుగుతున్న బదిలీల కౌన్సెలింగ్‌లో జాగరణ తప్పడం లేదు. వరుసగా మూడోరోజూ పడిగాపులు కాశారు. శుక్రవారం సీరియల్ నంబరు 1001 నుంచి 1800 దాకా పిలిచారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ రాత్రంతా కొనసాగింది. పరిశీలకులు సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు దగ్గరుండి పర్యవేక్షించారు. మరోవైపు తమకు అన్యాయం జరుగుతోందంటూ భాషాపండితులు నిరసన తెలియజేశారు. ఏటా బదిలీలు, సర్దుబాటు పేరుతో మానసిక వేదనకు గురి చేస్తున్నారని, శాశ్వత పరిష్కారం చూపాలంటూ ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సెలింగ్‌ను అడ్డుకోవడంతో ఆగిపోయింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేశారు. ఆందోళనకారులను బయటకు వెళ్లాలని చెప్పడంతో...కౌన్సెలింగ్‌కు ఆటంకం కల్గించకుండా శాంతియుత నిరసన తెలియజేస్తామని చెప్పి ప్లకార్డులు పట్టుకుని వేదికపై కూర్చున్నారు. మధ్యాహ్నం వరకు ఈ నిరసన కొనసాగింది. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలగజేసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పరిశీలకులు, డీఈఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల బదిలీకి గ్రీన్‌సిగ్నల్

అనంతపురం అగ్రికల్చర్: అన్ని శాఖల్లో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ దాదాపు ముగిసింది. ఇక రైతు సేవ కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) అసిస్టెంట్ల వంతు వచ్చింది. సచివాలయ వ్యవస్థలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మత్స్య శాఖ, అలాగే పశుసంవర్ధకశాఖ పరిధిలో పనిచేస్తున్న వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలు, వీఎఫ్‌ఏలు, వీఏహెచ్‌ఏలు జిల్లా వ్యాప్తంగా ఉన్న 451 ఆర్‌ఎస్‌కేలకు అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ నెల 30లోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి అపుడే అధికార పార్టీ నేతల ద్వారా పైరవీలు మొదలు పెట్టారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విద్యా పీఠం) ద్వారా 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. పదో తరగతిలో చేరేందుకు 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి పాసై 15 ఏళ్లు నిండిన వారు అర్హులని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు తెలియజేశారు. జూలై 30లోపు www.apopenschool. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 1 నుంచి 15 వరకు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌తో పాటు ఏఐ సెంటర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ–స్టాంప్ కొనలేం

అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న ఆనంద్ అదే ప్రాంతంలో కొనుగోలు చేసిన 5 సెంట్ల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామ్‌నగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలో డాక్యుమెంట్ రైటర్లను కలిశాడు. అయితే కార్యాలయంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు లేవని, రేణుక యల్లమ్మ గుడి సమీపంలో ఉన్న వెండర్ వద్దకెళితే ఈ–స్టాంప్ తీసుకువస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగుతుందని రైటర్ తెలిపాడు. దీంతో ఈ–స్టాంప్ వెండర్‌ను కలిస్తే రూ.100 విలువ చేసే స్టాంప్ రూ.150 అవుతుందన్నాడు. రూ.50 విలువ చేసే స్టాంప్ కావాలంటే రూ.80 చెల్లించాలన్నాడు. దీంతో చేసేదేమీలేక అధిక ధర చెల్లించి మూడు రూ.100 స్టాంపులు, ఒకటి రూ.50 స్టాంపు కొనుగోలు చేశాడు.

... ఇది ఒక్క ఆనంద్ సమస్య మాత్రమే కాదు రోజూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే వందలాది మంది ఇలాగే అధిక ధర చెల్లించి ఈ–స్టాంప్‌లు కొనుగోలు చేస్తున్నారు. ఈ అక్రమ దందా ద్వారా రోజుకు రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నట్లు సమాచారం.

- 8 నెలలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల కొరత
- ఇష్టారాజ్యంగా ఈ–స్టాంప్ విక్రయాలు
- ఒక్కో స్టాంప్‌పై రూ.50 అదనం



అనంతపురం రామ్‌నగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

అనంతపురం టౌన్: నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల సరఫరా నిలిచిపోవడంతో ఈ–స్టాంప్ విక్రయదారులు దందాకు తెరలేపారు. అనంతపురం నగరంలో నలుగురు మాత్రమే ఈ స్టాంప్ విక్రయదారులు ఉండగా... వీరు చెప్పిన ధరనే తుది నిర్ణయమవుతోంది. అదేమని అడిగితే స్టాంప్‌లు లేవని ఇబ్బందులకు గురి చేస్తారు. అనంతపురంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రోజూ రూ.లక్షలు విలువ చేసే స్టాంప్‌ల విక్రయాలు సాగుతుంటాయి. గతంలో నాసిక్ నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లను రిజిస్ట్రేషన్ శాఖ తెప్పించి అందుబాటులో ఉంచేది. అయితే 8 నెలలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

8 నెలల్లో కోల్పోయిన ఆదాయం రూ.32 కోట్లు

అనంతపురంలోని రామ్‌నగర్‌లో ప్రధాన కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు నాసిక్ నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల సరఫరా నిలిచిపోవడంతో జిల్లా వ్యాప్తంగా రోజూ రూ.15 లక్షలకు పైగా ఆదాయాన్ని ఆ శాఖ కోల్పోతోంది. ఒక్క రామ్‌నగర్‌లోని కార్యాలయంలోని స్టాంప్‌ల విక్రయ కేంద్రం ద్వారా రోజూ రూ.3 లక్షలకు పైగా ఆదాయం సమకూరేది. 8 నెలలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల కొరత కారణంగా జిల్లాలో నెలకు రూ.4 కోట్ల చొప్పున రూ.32 కోట్లకు పైగా ఆదాయాన్ని రిజిస్ట్రేషన్ శాఖ కోల్పోయింది. ఇదే అదునుగా భావించిన ఈ–స్టాంప్ వెండర్లు ఇష్టానుసారంగా ధరలు పెంచి స్టాంప్‌ల విక్రయాలకు తెరలేపారు. అధిక ధరకు స్టాంప్‌లను విక్రయించే వారిపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



ఈ–స్టాంప్‌ల విక్రయాలకు సంబంధించి విక్రయదారులకు కమీషన్‌ను రిజిస్ట్రేషన్ శాఖ చెల్లిస్తోంది. కాబట్టి అధిక ధరకు వారు విక్రయించరాదు. అలా కాదని అధిక ధరకు విక్రయించే వారి లైసెన్సు రద్దు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల కొరతపై ఇప్పటికే ఐజీ కార్యాలయానికి నివేదిక అందజేశాం. వచ్చే నెల మొదటి వారంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.
– విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

క్లుప్తంగా

బాలికపై అత్యాచారం.. పెళ్లి

- బాధితురాలు ప్రస్తుతం ఆరు నెలల గర్భిణీ
- నిందితుడిపై కేసు నమోదు

అనంతపురం: ఇంట్లో సేవలు చేయడానికి వచ్చిన బాలికపై అత్యాచారం చేసిన యజమాని అనంతరం ఆ బాలికను పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆ బాలిక ఆరు నెలల గర్భం దాల్చడంతో విషయం కాస్త బహిర్గతమైంది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం నగరంలోని తపోవనంలో నివాసముంటున్న 43 ఏళ్ల ఫయాజ్‌కు సంతానం లేకపోవడంతో తన బామ్మర్ది కుమార్తెను దత్తతకు తీసుకున్నాడు. ఈ క్రమంలో చిన్నారి ఆలనాపాలనా, ఇంట్లో పనులు చేసేందుకు బళ్లారి నుంచి 14 ఏళ్ల వయసున్న బాలికను నియమించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఆ బాలిక పుష్పవతి అయింది. పది రోజుల అనంతరం ఇంట్లో భార్య లేని సమయంలో బాలికపై ఫయాజ్ అత్యాచారం చేశాడు. తర్వాత గుట్టుచప్పుడు కాకుండా వివాహం చేసుకున్నాడు. ఇటీవల కడుపు నొప్పి అంటూ మెలికలు తిరుగుతున్న బాలికను గమనించిన అక్క (అనంతపురంలోనే నివాసముంటోంది) వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు బాలిక ఆరు నెలల గర్భంతో ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో మరోసారి వైద్య పరీక్షల నిమిత్తం అక్కడి వైద్యులు సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఫయాజ్‌పై బాల్య వివాహం, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు. ప్రస్తుతం బాలిక ఐసీడీఎస్ అధికారుల ఆధీనంలో ఉంది.

ఎరువుల కొరత రాకూడదు : డీఏఓ

అనంతపురం సెంట్రల్: ఎరువుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని కంపెనీ ప్రతినిధులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఎంఏటీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ–పాస్ ఆధార్ బయోమెట్రిక్ మిషన్ల పంపిణీ, 2025–26లో ఎరువుల పంపిణీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. ఎరువుల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాలను వివరించారు. కేటాయించిన ఎరువులు ఎప్పటికప్పుడు జిల్లాకు సరఫరా చేసేలా ఎరువుల కంపెనీ ప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. ఎరువులను తగినంత నిల్వ చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని డీలర్లకు సూచించారు. జిల్లాకు 785 ఈ పాస్ మిషన్లు కేటాయించారని, ఎరువులను ఈ–పాస్ ద్వారా మాత్రమే విక్రయించాలన్నారు. ఈ పాస్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి (టెక్నికల్) వంశీకృష్ణ, ఎరువుల కంపెనీ సేల్స్ ఆఫీసర్లు, డీలర్లు పాల్గొన్నారు.

అటవీ భూమిపై అక్రమార్కుల కన్ను

- ఎడారి నివారణలో భాగంగా 15 ఏళ్లుగా పెంచుతున్న చెట్లు
- టీడీపీ కార్యకర్త దుశ్చర్యకు మాయమైన 10 ఎకరాల్లోని పచ్చని చెట్లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

ప్రభుత్వ అటవీ భూములపై కన్నేసిన స్వార్థపరులు ఎడారి నివారణలో భాగంగా 15 ఏళ్లుగా పెంచుతున్న పచ్చని చెట్లను కూకటి వేళ్లతో సహా పెకలించేస్తున్నారు. ఈ దౌర్జన్యంపై గత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు ఫిర్యాదు చేయడం గమనార్హం.



రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లు నరికేసిన దృశ్యం



చెట్ల ఆనవాళ్లు లేకుండా చేసిన దృశ్యం

కణేకల్లు: బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో వేదవతి హగరి పరివాహక ప్రాంతంలోని అటవీ శాఖ పరిధిలో ఉన్న వేలాది ఎకరాల్లో ఇసుక మేటలు విస్తరించి ఎడారిని తలపిస్తున్నాయి. ఆషాడంలో గాలులకు ఈ ఇసుక తెరలు తెరలుగా ఎగిసి మేటలు మరింత విస్తరిస్తూ వచ్చాయి. దీంతో 15 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఎడారి నివారణలో భాగంగా కళేకుర్తి, మాల్యం, తుంబిగనూరు, మీన్లహళ్లి, బిదరకుంతంతో పాటు వివిధ గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టింది. మొక్కలు ఇప్పుడు భారీ వృక్షాలై కనుచూపు మేర పచ్చదనం నిండుకుంది. ఈ చెట్లతో ఇసుక దిబ్బలు ముందుకు కదలడం లేదు.

టీడీపీ కార్యకర్తల బరితెగింపు

కళేకుర్తి గ్రామ శివారులో హెచ్చెల్సీ అక్విడెక్ట్ కుడివైపున వేదవతి హగిరి ఒడ్డు ఉన్న ఎడారి ప్రాంతంపై కళేకుర్తి గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తల కన్నుపడింది. ఈ భూమి పంటల సాగుకు చాలా అనువుగా ఉండటంతో ఎలాగైనా కబ్జా చేయాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఐదారు రోజుల క్రితం సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలోని భారీ వృక్షాలను కూకటి వేళ్లతో సహా పెకలించి జేసీబీ సాయంతో వాటి ఆనవాళ్లు లేకుండా మాయం చేస్తూ భూమిని చదును చేసి సాగు భూమిగా మార్చుకున్నారు. ఈ దుశ్చర్యపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తెరవెనుక అటవీ అధికారి?

అటవీ శాఖ పరిధిలోని భూముల్లో పచ్చని చెట్లను నరికివేత వెనుక స్థానిక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హస్తమున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లో కొందరు చెట్లను రెండేళ్ల క్రితం నరికేసి సాగుభూమిగా మార్చుకుని పంటలు పండిస్తున్నారు. తాజాగా మరో 10 ఎకరాల్లోని రిజర్వ్ ఫారెస్ట్ కబ్జాకు గురైంది. ఈ అక్రమాల వెనుక సదరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు పెద్ద మొత్తంలో లెక్క ముట్టినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు.

సాగు ముసుగులో వ్యాపారం

వేదవతి హగిరి ఒడ్డున ఉన్న ఇసుక భూములు ప్రస్తుతం సారవంతమైన భూములుగా మారాయి. ఒకప్పుడు దేనికి పనికిరాని ఈ భూముల్లో వేరుశనగ, వరి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధ్యమని ఇటీవల రైతులు నిరూపించారు. దీంతో ఈ భూమికి భారీగా డిమాండ్ నెలకొంది. ఎకరా భూమి రూ.12లక్షల వరకు ధర పలుకుతున్నట్లు సమాచారం. ఈ వేదవతి హగిరి ఒడ్డున ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను ఇప్పటికే చాలా మంది కబ్జా చేసి సాగు భూమిగా మార్చేసుకున్నారు. పంటల సాగు ముసుగులో అనధికారిక అగ్రిమెంట్లతో భూమి విక్రయాలూ ఊపందుకున్నాయి.

పట్టించుకోకపోతే అడవులు మాయం

ఎడారి నివారణలో భాగంగా ఓ వైపు అధికారులు విస్తారంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తుంటే.. మరో వైపు కొందరు తమ స్వార్థం కోసం భారీ చెట్లను నరికేస్తున్నారు. పట్టపగలే రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో చెట్ల నరికేస్తున్నా అటవీ, రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించకపోతే భవిష్యత్తులో అడవి మాయమై కళేకుర్తి ప్రాంతం ఎడారిగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

రిజర్వ్ ఫారెస్ట్‌లో భారీ వృక్షాల నరికివేత అంశం, పరోక్షంగా సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తీరుపై గత సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారుల ద్వారా కలెక్టర్ దృష్టికి కళేకుర్తి వాసులు తీసుకెళ్లారు. తక్షణమే ఈ అంశంపై స్పందించి అటవీ ప్రాంత పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎంతటి వారినైనా ఉపేక్షించబోం

కళేకుర్తి గ్రామంలో కొందరు స్వార్థపరులు పోటీ పడి రాత్రికిరాత్రే చెట్లు నరికేస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక విచారణ చేపట్టి చెట్లను నరికేస్తున్న వారిని గుర్తించాం. ఫారెస్ట్ యాక్ట్ 1967 ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బీట్ ఆఫీసర్‌పై వచ్చిన ఆరోపణలు పూర్తి అవాస్తవం. పచ్చని చెట్లను పరిరక్షించే బాధ్యత ప్రతి పౌరునిపై ఉంది. చెట్లను నరికేసి ఎడారిగా మార్చొద్దని ప్రజలకు మనవి చేస్తున్నాం.

– దామోదరరెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రాయదుర్గం

పనులు వేగవంతం చేయండి : హెచ్చెల్సీ ఎస్ఈ



యర్రగుంట వద్ద యూటీని పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈలు

కణేకల్లు: హెచ్చెల్సీ ఆధునీకీకరణ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఎస్ఈ పురంధరరెడ్డి ఆదేశించారు. యర్రగుంట శివారులోని 137 కిలోమీటర్ వద్ద జరుగుతున్న యూటీ (అండర్ టన్నెల్) పనులతో పాటు బొమ్మనహాళ్ మండలంలో 115 నుంచి 130 కిలోమీటర్ మధ్య చేపట్టిన హెచ్చెల్సీ లైనింగ్ పనులను ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ దివాకరరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డీఈఈ చంద్రశేఖర్, జేఈలు ఓబుళపతి, రమణరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. యూటీ వద్ద వర్షపు నీరు నిలవడంతో వాటిని పూర్తిగా బయటికి పంపింగ్ చేయాలని సూచించారు. మంగళవారం స్లాబ్ వేస్తున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. 115, 117, 155, 169 కిలోమీటర్ వద్ద జరుగుతున్న డీఎల్ఆర్‌బీ (బ్రిడ్జ్) పనుల్లో నాణ్యత లోపించరాదని ఆదేశించారు. అనంతరం కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్, మోపిడి వద్ద ఎంపీఆర్, పీఏబీఆర్ రెగ్యులేటర్ పనులను పరిశీలించారు. నిర్ణీత గడువు లోపు పనులన్నీ పూర్తి కావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ

అనంతపురం సెంట్రల్: నిరుద్యోగ యువతీయువకులకు అనంతపురంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో 60 రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, లైఫ్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిషు, కస్టమర్ రిలేషన్ షిప్ అంశాల్లో శిక్షణ ఇస్తారు. 20 నుంచి 30 సంవత్సరాల్లోపు వయస్సు, ఇంటర్ ఉత్తీర్ణత, డిప్లమో, డిగ్రీ, ఇంజినీరింగ్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులు. ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. శిక్షణ కాలంలో మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయం ఉంటుంది. పూర్తి వివరాలకు 73969 50345లో సంప్రదించవచ్చు.

బెంగళూరు–బీదర్ మధ్య రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగళూరు–బీదర్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 15 నుంచి 29 వరకు శుక్ర, ఆదివారాల్లో (5 సర్వీసులు మాత్రమే) రాకపోకలు సాగిస్తుందని వెల్లడించారు. 15న బెంగళూరు జంక్షన్ నుంచి రాత్రి 9.15 గంటలకు ఎక్స్‌ప్రెస్ రైలు (06539) బయలుదేరి బీదర్ జంక్షన్‌కు మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు బీదర్‌లో మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి బెంగళూరుకు మరుసటి తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుందని తెలిపారు. ఈ రైలు ఈ నెల 16 నుంచి 30 వరకు ప్రతి శని, సోమవారాల్లో రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయంరోడ్డు, రాయచూర్, కృష్ణ, యద్గారి, వాడి, షాహబాద్, కలబురిగి, హమ్నాబాద్ మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ రైలు 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్‌బోగీలతోపాటు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పుట్లూరు: వీధి కుక్కల దాడిలో 37 గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. పుట్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు గొర్రెల పెంపకం చేపట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద గొర్రెలను దొడ్డిలో ఉంచేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి గొర్రెలను దొడ్డిలో వదిలి ఇంటికెళ్లి నిద్రించాడు. శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకునే లోపు దాదాపు 10 కుక్కలు చుట్టుముట్టి గొర్రెలపై దాడి చేస్తుండడాన్ని గమనించి, వాటి అదలించేలోపు 37 గొర్రెలు మృతి చెందాయి. జీవనాధారంగా ఉన్న గొర్రెల మృతితో శ్రీనివాసులు కన్నీటిపర్యంతమయ్యాడు. అప్పులు చేసి ఇటీవల గొర్రెలను కొనుగోలు చేశానని, ఘటనతో రూ.3 లక్షలు నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ అలివేలమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌బాషా, వీఆర్వో వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి సంధ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశువైద్యాధికారితో పంచనామా నిర్వహించి, నివేదిక సిద్ధం చేయించారు. గొర్రెల మృతితో నష్టపోయిన శ్రీనివాసులును ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి

- లేకపోతే చరిత్ర హీనులవుతారు
- ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం, మాజీ ఎంపీ తలారి రంగయ్య



మీడియాతో మాట్లాడుతున్న నదీం (చిత్రంలో) మాజీ ఎంపీ రంగయ్య, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత, మాదినేని ఉమా

కళ్యాణదుర్గం: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకపోతే సీఎం చంద్రబాబు ప్రజల దృష్టిలో చరిత్ర హీనులవుతారని ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహమ్మద్ అన్నారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర శుక్రవారం కంబదూరు మండలం డీసీ పల్లిలో సాగింది. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతతో కలసి నదీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలారి రంగయ్యతో కలసి వారు మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు అన్ని కులాలతో పాటు స్వచ్ఛంద సంస్థల హక్కులను దోచుకుతినడం పరిపాటిగా మారిందన్నారు. పేదల అభ్యున్నతి కోసం పరితపిస్తున్న ఆర్డీటీ కార్యక్రమాలకు విదేశీ నిధులే ముఖ్యమన్నారు. ఎన్నికల ముందు సీట్ల కోసం, అధికారం చేపట్టిన తర్వాత మంత్రి పదవుల కోసం వారాల తరబడి చర్చలు జరిపిన బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు.. నిస్వార్థ సేవలు అందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అంశంపై పెదవి విప్పకపోవడం దుర్మార్గమన్నారు. ఆర్డీటీ అనేది మతానికి సంబంధించినది కాదని, కేవలం మానవత్వానికి సంబంధినదని గుర్తించాలన్నారు. 55 ఏళ్లగా తలెత్తని సమస్య కూటమి ప్రభుత్వంలోనే ఎందుకు వచ్చిందని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏనాడూ ఆర్డీటీకి ఇంతటి కష్టం రాలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ భీమేష్, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరతో పాటు ఆర్డీటీ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఎస్పీ ఆదేశాలు బేఖాతర్

- తాడిపత్రి పోలీసుల తీరుతో విసిగిపోయిన జనం



కేసు నమోదు కోసం నెల రోజులుగా తాడిపత్రి పీఎస్ చుట్టు తిరుగుతున్న హరికృష్ణ కుటుంబ సభ్యులు

తాడిపత్రి టౌన్: 'కేసు నమోదు చేయాలంటే టీడీపీ నేతల సిఫారసు ఉండాలి. లేకపోతే ఎవరూ చెప్పినా వినేది లేదు' అంటూ తాడిపత్రి పోలీసులు బాహటంగానే చెబుతుండడంతో పట్టణ ప్రజలు విసిగిపోయారు. ఇంట్లో చోరీ జరిగి 30 రోజులు గడిచినా కేసు నమోదు చేయని ఘటననే ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళితే.. టైలర్స్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న హరికృష్ణ, అశ్విని దంపతులు గత నెల 13న ఇంట్లో లేని సమయంలో దుండగులు చొరబడి బీరువాలోని 12 తులాల బంగారు నగలు అపహరించారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. అయినా నేటికీ కేసు నమోదు చేయడంలో పోలీసులు ఉదాసీనత కనబరుస్తున్నారు. నెల రోజులుగా ప్రతి రోజూ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోక పోగా ఇటీవల బెదిరింపు ధోరణితో దుర్భాషలాడుతుండడంతో బాధితుల ఆవేదనకు అంతు లేకుండాపోయింది. ఇదే అంశంపై రెండు సార్లు ఏఎస్పీ రోహిత్‌కుమార్‌ను కలిసి విన్నవిస్తే కేసు నమోదు చేయాలని ఆయన స్వయంగా పట్టణ పోలీస్ అధికారులను ఆదేశించారు. అయినా కేసు నమోదులో పోలీసులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం తాడిపత్రిలో ఈ అంశమే హాట్ టాపిక్‌గా మారింది.

సర్వజనాస్పత్రిలో భద్రతా ప్రమాణాలు నిల్

- తేల్చి చెప్పిన భద్రతా కమిటీ సభ్యులు



సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ సాయిరాం, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, తదితరులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో భద్రతా ప్రమాణాలు ఏమాత్రం లేవని, అత్యంత కీలకమైన ఫైర్ ఫైటింగ్ సిస్టమ్ వృథాగా ఉందని, సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో పాటు సెక్యూరిటీ అంతంత మాత్రంగానే ఉందని సెక్యూరిటీ వింగ్ ఆడిట్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం సెక్యూరిటీ వింగ్ ఆడిట్ కమిటీ సభ్యులైన డీఎస్పీ సాయిరాం (విజయవాడ), ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, డిప్యూటీ ఫైర్ ఆఫీసర్ లింగమయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖాధికారులు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో భద్రతా ప్రమాణాలపై తనిఖీ చేశారు. రూ.2.2 కోట్లతో ఏర్పాటు చేసిన ఫైర్ ఫైటింగ్ సిస్టమ్ నిరుపయోగంగా ఉన్నట్లు గుర్తించారు. ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగితే ప్రస్తుతం ఉన్న ఫైర్ ఫైటింగ్ సిస్టమ్‌తో ఎలాంటి ఉపయోగమూ ఉండదనే నిర్ధారణకు వచ్చారు. అలాగే ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పూర్తిగా లేవని తెలుసుకున్నారు. వివిధ వార్డులకు సెక్యూరిటీ లేకపోవడాన్ని గమనించారు. పార్కింగ్‌కు స్థలం లేదని, బైక్‌లు, కార్లు, అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని గుర్తించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, వైద్య కళాశాల చుట్టూ ప్రహరీని పకడ్బందీగా ఉంచేలా చూడాలన్నారు. అనంతరం డీఎస్పీలు సాయిరాం, నీలకంఠేశ్వర రెడ్డి సూపరింటెండెంట్‌ను కలిశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీసీ కెమెరాలు అదనంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాయిస్ సీసీ కెమెరాలను అందుబాటులో తేవాలన్నారు. అదేవిధంగా వైద్యులపై దాడులకు పాల్పడితే వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసేలా చట్టాలున్నాయన్న బోర్డులను వివిధ వార్డుల్లో ఏర్పాటు చేయాలన్నారు.

నేడు దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శనివారం ఉదయం దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 6.30 గంటలకే పరేడ్ మైదానం చేరుకునేలా చూడాలన్నారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మైదానంలో కనీస సౌకర్యాలు ఉండాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్, డీఎంహెచ్ఓ ఈబీదేవి, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఆర్డీఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఆయుష్ అధికారులు, యోగా గురువులు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో వీడిన మిస్టరీ

- గత ఏడాది అక్టోబర్‌లో ఘటన
- నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుట్లూరు: గత ఏడాది అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వివాహిత కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. భర్తే కాలయముడై ఆమెను హతమార్చినట్లుగా నిర్ధారించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. పుట్లూరు పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ సత్యబాబు వెల్లడించారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా దింబల్‌గుడి గ్రామానికి చెందిన సంగీత (21), నాగరాజు దంపతులు బతుకు తెరువు కోసం పుట్లూరు మండలానికి వలస వచ్చారు. ఎ.కొండాపురం గ్రామంలో నివాసముంటూ కూలి పనులతో జీవనం సాగించేవారు. గత ఏడాది అక్టోబర్ 15న సంగీత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గొంతు నులిమి హతమార్చినట్లుగా అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి పక్కా ఆధారాలతో గురువారం భర్త నాగరాజును అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో తన భార్యపై అనుమానంతో గొంతు నులిమి తానే హతమార్చినట్లుగా అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ శాఖ ఏఈపై విజిలెన్స్ విచారణ?

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక రూరల్ పరిధిలో విద్యుత్ శాఖ ఏఈగా పనిచేస్తూ ప్రస్తుతం బదిలీపై అనంతపురానికి వెళ్లిన సలీంపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు అందజేసే విషయంలో భారీగా ముడుపులు దండుకున్నట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాల్లో కాంట్రాక్టర్ షామీర్‌కూ వాటా ఉందంటున్నారు. ప్రతి పనికీ డబ్బు డిమాండ్ చేసి, ఇచ్చేంతవరకూ కొర్రీలు వేస్తూ వేధించేవారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సలీం అవినీతిపై ఆధారాలతో ఉన్నతాధికారులకు పలువురు రైతులు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం.

16న కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

అనంతపురం అర్బన్: సమస్యల పరిష్కారంలో కూటమి సర్కార్ అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈ నెల 16న కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా తలపెట్టినట్లు అంగన్‌వాడీ వర్కర్ల సంఘం నాయకులు ప్రకటించారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం అనంతరం విలేకరులతో సంఘం గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్, నాయకులు శకుంతల, రమాదేవి, కాత్యాయని మాట్లాడారు. అంగన్‌వాడీలకు తక్కువ వేతనం చెల్లిస్తూ పని భారాన్ని పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు తల్లికి వందనం పథకం వర్తించడం లేదన్నారు. రూ.12 వేలు ఆదాయం ఉన్నవారికి వర్తించదని ప్రభుత్వమే చెబుతున్నప్పుడు... రూ.11,500 గౌరవ వేతనం అందుకుంటున్న అంగన్‌వాడీ వర్కర్లకు, రూ.7 వేలు పొందుతున్న మినీవర్కర్లకు ఎందుకు వర్తింపజేయరని ప్రశ్నించారు. తక్కువ వేతనం పొందుతున్న అంగన్‌వాడీలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. రేషన్ కార్డులు ఇవ్వాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు పనిచేయని ఫోన్లు ఇచ్చి... వాటితో ఆన్‌లైన్ పనులు చేయాలని ఒత్తిడి చేస్తుండడం సబబు కాదన్నారు. యాప్‌ల ఒత్తిడి తగ్గించాలన్నారు. ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం తొలగించాలన్నారు. ర్యామ్ సామర్థ్యం అధికంగా ఉండే ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులను నేరుగా పౌర సరఫరాల సంస్థ ద్వారా సరఫరా చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 16న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

మార్కెట్‌లోకి 'న్యూ టాటా ఆల్ట్రోజ్'



కారును ప్రారంభిస్తున్న ఆర్టీఓ సురేష్ నాయుడు

అనంతపురం సెంట్రల్: నగరంలోని రిత్వికా టాటా మోటార్స్ షోరూంలో శుక్రవారం ఆర్టీఓ సురేష్ నాయుడు చేతుల మీదుగా టాటా కంపెనీ ప్రీమియం హ్యాచ్ బ్యాక్ ఆల్ న్యూ ఆల్ట్రోజ్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ వర్షన్‌లలో లభిస్తుందని, అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం, డిజైన్‌తో రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో షోరూం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సీఈఓ ప్రవీణ్‌రెడ్డి, టీఎస్‌ఎం సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుబ్రహ్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న గురువుల కృషిని గుర్తిస్తూ వారికి గురుబ్రహ్మ, గురు శిరోమణి పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు ఈఎస్‌ఎస్ నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం విద్యారంగమే కాకుండా క్రీడలు, కళలు వంటి వివిధ రంగాలలో గురువులుగా రాణిస్తున్న వారు అవార్డులకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి గలవారు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్‌నం .1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15' చిరునామాకు చేరేలా పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9652347207 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పిద్దాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

అనంతపురం సెంట్రల్: ఆరు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో, మూడు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం నగరంలోని రాణినగర్ అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ



వెంకట కుమార్, రూరల్ ఏఓ

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం రూరల్ మండలం వ్యవసాయ అధికారి (ఏఓ)గా వెంకట కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ జే.శశికళ జేడీఏ ఆఫీసుకు బదిలీ కాగా.. అక్కడ పని చేస్తున్న వెంకట కుమార్ ఇక్కడికి బదిలీ అయ్యారు. గురువారం ఏడీఏ ఎం.రవిని కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. శుక్రవారం ఏఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటకుమార్‌కు ఏఈఓలు మురళీకృష్ణ, భాగ్య, మల్లికార్జున, అగ్రి ఇన్‌పుట్స్ డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీపొట్టి శ్రీరాములు నగర పాలకొన్నత పాఠశాలలో 1979 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పూర్వ విద్యార్థులు, నిర్వాహకులు కృష్ణమూర్తి, సుధాకర్ బాబు, ఆచార్య సత్యనారాయణ, సుదర్శన్ రెడ్డి, జహీర్, సంధాని, రాజశేఖర్, శీన, మురళి, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, ధనుంజయ తెలిపారు. పూర్వ గురువులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా



యువతికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 60 కంపెనీలు ఉద్యోగాల కల్పనకు ముందుకొచ్చాయి. ఉదయం నుంచి సాయంత్రం ఇంటర్వ్యూల ప్రక్రియ వేగంగా సాగింది. 1,450 మందికి ఉద్యోగాలు వచ్చాయి. యువతీ యువకులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో జీడీఎం సూర్యనారాయణ, ప్రతాపరెడ్డి, నారాయణ స్వామి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, డీఆర్‌డీఏ పీడీ శైలజ, కమిషనర్ బాలస్వామి, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఫ్యాన్ బెల్ట్ తెగిపోవడంతో నడిరోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు



బస్సును స్టార్ట్ చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్న డ్రైవర్

బండి కాదు.. మొండి ఇదీ

కూటమి ప్రభుత్వం రవాణా రంగంపై శ్రద్ధ తీసుకోవడం లేదు. జిల్లాలో పాతబడిన బస్సులనే (కండీషన్‌లో లేనివి) తిప్పుతున్నారు. రోడ్లపైకి ఎక్కగానే మరమ్మతుకు గురై ఎక్కడ ఆగిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఒక్కోసారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. శుక్రవారం ఉరవకొండ నుంచి అనంతపురానికి రాకపోకలు సాగించే బస్సు సిండికేట్ నగర్‌కు చేరుకోగానే అకస్మాత్తుగా ఆగిపోయింది. బస్సులో ఫ్యాన్ బెల్ట్ తెగిపోవడంతో ప్రయాణికులు చాలా సేపు ఇబ్బంది పడ్డారు. డ్రైవర్, కండక్టర్ మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి చేసేది ఏమీ లేక మరో బస్సులో ప్రయాణికులను ఎక్కించి పంపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



మరమ్మతులు చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

శిథిలావస్థలో భవనం.. తప్పని అవస్థలు



హంపాపురంలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం

రాప్తాడు మండలం హంపాపురంలోని ఎస్సీ కాలనీలో ఉన్న పాత అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరి, కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలలోని చిన్న తరగతిలోకి మార్చారు. ఆ తరగతి గదిలోనే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన సరుకులు, గుడ్లు పెట్టుకోవడంతో చిన్నారులకు మరొక గది లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే రూంలోనే నిత్యావసర సరుకులు, రికార్డులు, మరో పక్క చిన్నారులను ఉంచడంతో వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. మరో అంగన్‌వాడీ కేంద్రానికి కూడా పక్కా భవనం లేకపోవడంతో ఆ భవనాన్ని కూడా అద్దె భవనంలో నిర్మిస్తున్నారు. రెండో కేంద్రానికి సంబధించి అంగన్‌వాడీ భవనం మంజూరైనా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత భవనాన్ని కూల్చివేయాల్సిన అవసరం ఉంది. నూతన భవనాన్ని నిర్మించి, మధ్యలోనే ఆగిపోయిన రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని త్వరగా నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – రాప్తాడు:

నిరుద్యోగ భృతిపై ఉద్యమ కార్యాచరణ

- ఈ నెల 15 నుంచి జూలై 15 వరకూ సంతకాల సేకరణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం అర్బన్: నిరుద్యోగభృతి, ఉద్యోగ, ఉపాధి సాధనకు ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వంపై ఏఐవైఎఫ్ పోరుబాటకు సిద్ధమైంది. స్థానిక నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, లేకపోతే రూ.3 వేలు చొప్పున నిరుద్యోగభృతి అందిస్తామంటూ ఎన్నికల్లో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా యువతకిచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదన్నారు. హామీలు అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మెడలు వంచి ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతిని సాధించుకునేందుకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 15 నుంచి జూలై 15 వరకు చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష కార్యాచరణతో ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, కుళ్లాయి స్వామి, నాయకులు ధనుంజయ, దేవ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటుకలపల్లి పీఎస్ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన మేరకు... జంగాలపల్లికి చెందిన ఆకులేటి వెంకటేశు (56) జీవాల పోషణతో పాటు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతంలో ఆయన మధ్యవర్తిగా ఉంటూ కొందరికి గొర్రెలు అమ్మించాడు. కొనుగోలు చేసిన వారు రూ.12 లక్షల వరకూ చెల్లించకుండా వాయిదాలు వేస్తూ వచ్చారు. ఈ క్రమంలో అమ్మినవారు మధ్యవర్తిగా ఉంటున్న వెంకటేశుపై ఒత్తిడి పెంచారు. చివరకు తన చేతి నుంచి వారికి డబ్బులు చెల్లించాడు. ఈ విషయమై శుక్రవారం మధ్యాహ్నం వెంకటేశు దంపతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కష్టం చేసి సంపాదించిన సొమ్మంతా ఎవరికో పూచీపడి చెల్లించావంటూ భార్య ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశు ఊరి చివర గొర్రెలు విడిచిన తోటలోకి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మృతదేహం మోకాళ్లపై కూర్చున్నట్లుగా ఉండడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం, ఏపీ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

రాప్తాడు: బలవంతపు భూ సేకరణను వెంటనే ఆపాలని రాప్తాడు రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బాధిత రైతులతో కలిసి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామాంజనేయులు తదితరులు తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈ పార్క్ పేరుతో మండలంలోని బొమ్మేపర్తి గ్రామ రెవెన్యూ పొలంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములను తీసుకోవద్దన్నారు. సర్వే నెంబర్ 307లో దాదాపుగా 27 మంది రైతులకు సంబంధించి 120 ఎకరాల పొలంలో రెవెన్యూ అధికారులు బలవంతపు భూసేకరణ చేస్తున్నారన్నారు. అప్పటి రెవెన్యూ అధికారులు బాధిత రైతులకు డీ పట్టాలు, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత 60 సంవత్సరాల నుంచి బాధిత రైతులు తమ భూముల్లో ఉన్నటు వంటి గుట్టలు, రాళ్ల తొలగించేందుకు ఒక్కో రైతు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చు పెట్టి భూమిని సాగులోకి తెచ్చుకోవడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే మరి కొంత మంది రైతులు తమ పొలాల్లో బోరు బావులు తవ్వుకొని పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇంకొంత మంది రైతులు పాడి ఆవుల కోసం షెడ్లు ఏర్పాటు చేసుకుని ఆవులు, గొర్రెలు, మేకలు పెంచుకుంటూ జీవనం చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది మార్చిలో బొమ్మేపర్తి రెవెన్యూ గ్రామంలో 307 సర్వే నెంబర్‌లో 114 ఎకరాలు అప్పగించడానికి తహసీల్దార్ ఏపీఐఐసీ అధికారులకు లెటర్ పంపడం జరిగిందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం కనీసం ఆ రైతులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా పరిశ్రమల పేరుతో ఆ భూములను పేదల నుంచి బలవంతంగా లాక్కొని ఇవ్వడం దారుణమన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవసరమే కానీ పేదల భూములను తీసుకోవడం సబబు కాదని హితము పలికారు. పేదలకు ప్రభుత్వం సహాయం చేయాల్సింది పోయి ఇలా వారికి సమాచారం తెలియకుండా దౌర్జన్యంగా తీసుకోవడం అన్యాయమన్నారు. పరిశ్రమల కోసం తమ భూములను ఇవ్వలేమని బాధిత రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, సీపీఎం, రైతు సంఘం నాయకులు, బాధిత రైతులు ముత్యాలప్ప, మల్లికార్జున, మాధవయ్య, వేణుగోపాల్, వన్నూరప్ప, నిర్మల, మౌనిక, పార్వతమ్మ, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల చేతివాటం

గుంతకల్లు టౌన్: దుకాణంలో చేతి వాటాన్ని ప్రదర్శించిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. గుంతకల్లు వన్‌టౌన్ ఏఎస్‌ఐ థామస్ డెన్నీ తెలిపిన మేరకు... గత నెల 19న గుంతకల్లులోని ధర్మవరం గేట్ రోడ్డులోని అరుణాచల వరల్డ్ ఆఫ్ ఫ్యాషన్స్ దుకాణానికి కర్నూలు నగరంలోని చెంచు నగర్‌కు చెందిన చెంచు గోవిందమ్మ, చెంచు లక్ష్మి వెళ్లారు. ఆ సమయంలో దుకాణ యజమాని, సిబ్బంది దృష్టిని ఏమార్చి దాదాపు రూ.25 వేలు విలువ చేసే వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలను అపహరించారు. రెండు గంటల అనంతరం వచ్చిన మరో కస్టమర్లకు చూపించేందుకు వెతికితే ఆభరణాలు కనిపించలేదు. దీంతో దుకాణ యజమాన్ని బద్రీనాథ్ వెంటనే సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించడంతో ఇద్దరు మహిళలు నగలను అపహరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. చోరీకి పాల్పడిన సదరు మహిళలు శుక్రవారం అదే దుకాణానికి రావడంతో సిబ్బంది పసిగట్టి నిలదీశారు. దీంతో మహిళలిద్దరూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక ట్విన్ లైన్ వద్ద మహిళలను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్త ధర్మవరంలో.. భార్య పామిడిలో

- నిబంధనలకు విరుద్ధంగా 'స్పౌజ్' కోటా టీచర్ బదిలీ
- విద్యాశాఖ వివాదాస్పద నిర్ణయం

అనంతపురం ఎడ్యుకేషన్: 'స్పౌజ్' కోటా టీచర్ బదిలీలో విద్యాశాఖ అధికారులు వివాదాస్పద నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. స్పౌజ్ కోటా కింద బదిలీ అయ్యే టీచర్లు.. స్పౌజ్ పని చేస్తున్న సమీపంలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయంలో కమిషనర్ విజయ రామరాజు చాలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జరిగిన కౌన్సెలింగ్‌లో భర్త ధర్మవరంలో పని చేస్తుంటే.. భార్యను పామిడి మండలానికి బదిలీ చేశారు. అంతకు ముందు దాకా అదే పాఠశాలలో ఖాళీగా ఉంటే స్పౌజ్‌ను కూడా అక్కడికే పంపిన అధికారులు.. ఈమె విషయంలో మాత్రం తప్పుడు నిర్ణయం తీసుకోవడం వెనక అంతర్యం ఏమిటనే చర్చ జరుగుతోంది. స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లకు స్పౌజ్ సర్టిఫికెట్‌ను ఒకటికి రెండుసార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మరి పామిడికి పంపిన టీచర్ విషయంలో ఇలా ఎందుకు జరగలేదనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఓ కీలక అధికారి ఆదేశాల మేరకు ఉద్యోగులు కావాలనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఏది ఏమైనా వివాదాస్పద నిర్ణయం తీసుకున్న విద్యాశాఖ అధికారులపై సామాన్య టీచర్లు మండి పడుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్ బాబును వివరణ కోరగా.. సంబంధిత టీచర్ తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లనే ఇలా పొరపాటు జరిగిందని వెల్లడించారు. వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కానిస్టేబుల్ వీరంగం

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ కేంద్రంలో ఓ పోలీసు కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. ఈయన అనంతపురం నగరంలో పని చేస్తుండగా.. భార్య 'స్పౌజ్' కోటా కింద బదిలీకి దరఖాస్తు చేసుకుంది. అనంతపురం రూరల్ మండలంలో ఖాళీ లేకపోవడంతో దగ్గరగా అంటే గార్లదిన్నె మండలంలో కోరుకోవాలని అధికారులు సూచించారు. లేదా బత్తలపల్లి మండలం తీసుకోవాలని చెప్పారు. అయితే కానిస్టేబుల్ మాత్రం తన భార్యకు కనగానపల్లి మండలం ఇవ్వాలంటూ పట్టుబట్టాడు. గార్లదిన్నె, బత్తలపల్లి మండలాలు తీసుకునేందుకు ససేమిరా అంటూ వాగ్వాదానికి దిగాడు. అరగంటకు పైగా పంచాయితీ తేలకపోవడంతో సామాన్య టీచర్లు తిరగబడే పరిస్థితి నెలకొంది. చేసేది లేక చివరకు గార్లదిన్నె మండలం తీసుకోవాల్సి వచ్చింది.

అనారోగ్యంతో హోంగార్డు మృతి



నరసింహులు (ఫైల్)

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో పని చేసే హోంగార్డ్ నరసింహులు (53) అనారోగ్యంతో మృతి చెందారు. అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన ఈయన బ్యాండ్ బ్యాస్ టీంలో పనిచేస్తున్నారు. అనంతపురంలోని రాంనగర్‌లో నివాసం ఉండేవారు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో అనంతపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గార్లదిన్నెలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్ఐ వలి, హోంగార్డుల ఇన్‌చార్జ్ రామాంజనేయులు తదితరులు నరసింహులు మృతునికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బాల్య వివాహంపై కేసు నమోదు

అనంతపురం: నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాల్య వివాహంపై కేసు నమోదైంది. వివరాలు.. మారుతీ నగర్‌కు చెందిన ఓ మైనర్ బాలిక (17) అనంతపురం నగరంలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకెండియర్ చదువుతోంది. ఇటీవల కళాశాలలో తన సీనియర్ విద్యార్థి వంశీని ప్రేమించి పెళ్లిచేసుకుని గుంటూరు జిల్లా చీరాలలో ఉంటున్నారు. తల్లిదండ్రులు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గుంటూరు జిల్లా చీరాలలో ఉన్న వీరిని శుక్రవారం అనంతపురం తీసుకొచ్చారు. వంశీపై బాల్య వివాహం కేసుతో పాటు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత బాలిక చికిత్స పొందుతోంది.

ఉద్యానశాఖ డీడీగా ఉమాదేవి

- ఏడీగా దేవానంద్ బాధ్యతలు



ఉమాదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానశాఖ డిప్యూడీ డైరెక్టర్ (డీడీ)గా డి.ఉమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా దేవానంద్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. వారికి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. పండ్ల తోటలకు నెలవుగా ఉన్న అనంతపురం జిల్లాలో ఉద్యానశాఖ ద్వారా రైతులకు అదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. పలువురు ఉద్యానాధికారులు, కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం నవోదయం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం, గంజాయిపై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నాయుడు, ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు ఈఈల నియామకం

అనంతపురం సెంట్రల్: జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల (ఈఈ) బదిలీలు శుక్రవారం అధికారంగా వెలువడ్డాయి. జిల్లాకు ఇద్దరు అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోలవరం ప్రాజెక్టు డీఎస్‌ఈగా పని చేస్తున్న సుధాకర్‌రావును ఇరిగేషన్ సర్కిల్ డీఎస్‌ఈగా, అలాగే సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పార్థసారథిని హెచ్చెల్సీ లోక్ డివిజన్ ఈఈగా నియమించారు.

రేపు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి

అనంతపురం కల్చరల్: స్థానిక లలిత కళాపరిషత్తులో ఆదివారం సాయంత్రం గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, నిర్వాహకుడు తలారి శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని సంగీత సంస్థలు కలిసి నిర్వహిస్తున్న సంగీత విభావరిలో సీనియర్ గాయనీ గాయకులే కాకుండా అధికారులు కూడా మధుర గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో చెరువు కట్ట వద్ద హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రీ సాహెబ్ దర్గాలో గంధం ఉరుసు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూల చాందినీ డెకరేషన్లతో డప్పులు వాయిద్యాల నడుమ జిల్లా కేంద్రం నుంచి దర్గా ప్రాంగణానికి చేరింది. బనగానిపల్లి సాహెబ్ కుమారులు హజరత్ సయ్యద్ హుసేన్, బాదుషా, యముని, వారిచే సలాంప ఫాతెహా ఖానీ నిర్వహించారు. అనంతరం దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకలకు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి స్వామి వారి శిష్యులు విచ్చేశారు. సిబ్బందితో కలిసి సీఐ పుల్లయ్య బందోబస్తు నిర్వహించారు.

సామూహిక యోగా సాధన



యోగాసనాలు చేస్తున్న పోలీసులు

అనంతపురం: అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులు సామూహిక యోగ సాధన చేశారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని.. మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడుతుందని యోగా శిక్షకుడు చలపతి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు పవన్ కుమార్, రాముడు, ఆర్ఎస్ఐలు బాబ్ జాన్, మగ్బుల్, రమేష్ నాయక్, ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ హార్టికల్చర్ ఏడీగా రాజకృష్ణా రెడ్డి



అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ హార్టికల్చర్ ఏడీగా రాజకృష్ణా రెడ్డి నియమితులయ్యారు. కర్నూలు నుంచి ఆయన బదిలీపై అనంతపురం నగరపాలక సంస్థకు వచ్చారు. కాగా శుక్రవారం ఈయన కమిషనర్ బాలస్వామి వద్ద రిపోర్టు చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా హార్టికల్చర్ అడిస్టెంట్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉండటంతో భర్తీ చేశారు.

ఉరుసు మహోత్సవాలు ప్రారంభం



విద్యుద్దీపకాంతుల్లో దర్గా

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లిలో హజరత్ సయ్యద్ కాదర్, మహమ్మద్ దీవాన్ ఖాద్రి ఉరుసు మహోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని దూదేకుల, ముస్లింలు రాత్రి 10 గంటలకు గ్రామంలో ముజావర్ ఇంటి నుంచి పూల చాందినీతో ర్యాలీ చేపట్టారు. ఫకీర్లు గంధం తీసుకుని మేళతాళాలతో వచ్చి నూతనంగా నిర్మించిన దర్గాపై హజరత్ సయ్యద్ ఖాదర్, మహమ్మద్ దీవాన్ షా ఖాద్రి సమాధులపై గంధం పూజ నిర్వహించారు. శనివారం గ్రామంలో ఉరుసు కార్యక్రమంతో పాటు రాత్రి 9 గంటలకు గొప్ప ఖవ్వాలీ పాట కచేరి కార్యక్రమం, ఆదివారం మధ్యాహ్నం జయారత్ (కందూరి) కార్యక్రమాలు నిర్వహిస్తామని ముస్లింలు తెలిపారు.